ong-5_ong-5.qxd 4/4/2026 12:02 AM Page 1



ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## నేడు బాబుజగ్జీవన్‌రామ్ జయంతి మహోత్సవంను జయప్రదం చేయండి

**ఒంగోలు, ప్రభాతవార్త**

డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ 118వ జయంతి మహోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నెల్లూరు బస్టాండ్ వద్ద గల డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పమాలంకరణ కార్యక్రమం జరుగుతుందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ ఎన్.లక్ష్మీ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం 10.20 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనం నందు జ్యోతి ప్రజ్వలన, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పమాలంకరణ, ఉదయం 10.30గంటలకు అతిధుల ఉపన్యాస కార్యక్రమం నిర్వహించడబుతుందన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, షెల్యూల్డ్ కులముల షెడ్యూల్డ్ తెగల సంఘ నాయకులు, ప్రజలు జయంతి మహోత్సవ సభకు విచ్చేసి జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

## ఆంధ్రప్రదేశ్ పవన విద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధిపై మాగుంట ప్రశ్న

**ఒంగోలు, ప్రభాతవార్త**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పవన విద్యుత్ ప్రాజెక్టులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల చర్యలు, నిధులు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర కొత్త, పునరుత్పాదక శక్తి, విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద ఎస్సో నాయక్ సమాధానమిస్తూ.. జాతీయ పవన విద్యుత్ సంస్థ అంచనా ప్రకారం, దేశం, ఆంధ్రప్రదేశ్‌లో పవన విద్యుత్ ప్రాజెక్టుల మొత్తం అంచనా సామర్థ్యం, 1,164గిగా వాట్లుగా ఉండగా, ప్రస్తుత ఉత్పత్తి ప్రాజెక్టుల సామర్థ్యం 55132 మెగా వాట్లుగా ఉండగా, అమలు దేశలో 29,534 మెగా వాట్ల ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. పవన విద్యుత్‌కు సంబంధించి, ఆంధ్రప్రదేశ్ 1,23,336 గిగా వాట్లు అంచనా సామర్థ్యం గల ప్రాజెక్టులు, 4,416 మెగా వాట్లు ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యం గల ప్రాజెక్టులు, 2,477 మెగా వాట్ల ప్రాజెక్టులు అమలులో ఉండగా, దేశం మొత్తంలో 11,63,856 గిగా వాట్లు అంచనా సామర్థ్యం గల ప్రాజెక్టులు, 55,132 మెగా వాట్లు ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలో మొత్తంలో 29 ప్రధాన పవన విద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధి సంస్థలు, 11 పవన టర్బైన్ తయారీ సంస్థలు ఉన్నాయని తెలిపారు. హరిత ఇంధన కారిడార్ పథకం కింద ప్రత్యేక విద్యుత్ లైన్ల ఏర్పాటుకు, 2020-21 నుండి 2024-25 వరకు దేశంలో రూ1,237కోట్లు మంజూరు చేయగా, ఆంధ్రప్రదేశ్‌లో రూ.83 కోట్లు మంజూరు చేయబడిందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## అధికారుల పాలనకై ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 47ను ఉపసంహరించుకోవాలి

### - సర్పంచ్‌ల సంఘం డిమాండ్ జి.వీరభద్రాచారి

**ఒంగోలు, ప్రభాతవార్త**



రాష్ట్రంలో గ్రామ పంచాయతీలలో అధికారుల పాలన నిమిత్తం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 47ను తక్షణమే ఉపసంహరించుకొని, గ్రామాలలో ప్రజల పక్షాన పర్సన్ ఇన్‌చార్జిలుగా సర్పంచ్, పాలక వర్గాలను కొనసాగించాలని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి.వీరభద్రాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒక సారి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సినటువంటి ప్రభుత్వం తనకు తానుగా వాయిదా వేసి ఈ రోజు అధికారులు పాలనకు శ్రీకారం చుట్టి ప్రజా స్వామ్యానికి భంగం కలిగించిందన్నారు. దీనిపై హైకోర్టులో కేసులు వేయగా హైకోర్టు సూటిగా అధికారులు తమ బాధ్యతల్ని తాము నిర్వహించడంలో ఉండగా, పంచాయతీలలో పరిపాలన కోసం పాలక వర్గ నిర్ణయాలు ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించిందన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ మొదలు నుండి వివరాలు పరిశీలిస్తే అనేక మార్లు పంచాయతీ ఎన్నికలు వాయిదా పడ్డాయని ఆ వాయిదా పడిన ప్రతి సారి పర్సన్ ఇన్‌ఛార్జిలుగా ఆయా పాలక వర్గాలు కొనసాగాయని వీరభద్రాచారి గుర్తు చేశారు. 2018లో , నేడు 2026 లో మాత్రమే అధికారుల పాలనకు నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. 2018లో పంచాయతీ రాజ్ మంత్రిగా నారా లోకేష్ ఉండగా, నేడు ఉప ముఖ్యమంత్రి పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ ఉండడం విశేషమన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం బెషజాలకు పోకుండా గ్రామ పంచాయతీలలో ప్రజల పక్షాన పాలక వర్గాలను కొనసాగిస్తూ జీవో నెంబరు 47ను ఉపసంహరించుకోవాలని కోరారు. లేని యెడల న్యాయస్థానం ద్వారా ఆ నిర్ణయం అమలుకై న్యాయ పోరాటం కొనసాగిస్తామని వీరభద్రాచారి తెలిపారు.

## పీఎం కేంద్రీయ విద్యాలయం విద్యా సంవత్సరంకు అడ్మిషన్లు ప్రారంభం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ప్రధానమంత్రి కేంద్రీయ విద్యాలయం ఒంగోలు నందు 2026 2027 విద్యా సంవత్సరమునకు రెండవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి లకు అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైందని ఒంగోలు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మనీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు కేంద్రీయ విద్యాలయాల్లో రెండు నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యను అభ్యసించాలనుకునే వారు ఆఫ్లైన్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్ కొరకు వారి వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకొనవచ్చునని తెలిపారు పీఎం కేంద్రీయ విద్యాలయం వెబ్సైట్ నుండి దరఖాస్తు పత్రాన్ని డౌన్లోడ్ చేసుకొని సంబంధిత ధ్రువపత్రాలను జతపరిచి పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈ నెల 8వ తేదీలోగా సమర్పించాలన్నారు తరగతి రెండు నుండి తొమ్మిదవ తరగతి వరకు అన్ని కేటగిరీలకు చెందిన అందరి దరఖాస్తులు స్వీకరిస్తారు దరఖాస్తు సమర్పించడానికి ఏప్రిల్ 8వ తేదీ చివరి తేదీగా నిర్ణయించారు మరియు 10 నుండి 12వ తరగతిలో గల ఖాళీలకు గాను దరఖాస్తు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు మరియు కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి గల ఉద్యోగుల పిల్లలు మాత్రమే అర్హులు అన్నారు ఎంపికైన విద్యార్థుల జాబితాను ఏప్రిల్ 13న ప్రకటిస్తామని పేర్కొన్నారు ఎంపికైన విద్యార్థులకు ఈనెల 15 నుండి 20 వరకు అడ్మిషన్లు ప్రక్రియ జరుగుతుంది అని కేంద్ర విద్యాలయ సంఘటన్ న్యూఢిల్లీ వారి మార్గదర్శకత్వాలను అనుసరించి అడ్మిషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. వివరాలకు ఒంగోలు కెవిఎస్. ఏసీ .డాట్ ఇన్ వెబ్సైట్ను లేదా విద్యాలయం నందు స్వయంగా సంప్రదించాలని ప్రిన్సిపల్ మనీష్ కుమార్ కోరారు

## యువజన అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలులోని ఆర్టీసీ డిపో వెనుక ఉన్న 24వ వార్డులోని వంట వారికి కాలనీ లోని యువజన అభ్యుదయ సమితి వారి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు చలివేంద్రం ప్రారంభానికి నరసం గౌరవ అధ్యక్షురాలు మరియు వంట వారి కాలనీ వ్యవస్థాపకురాలు తేళ్ల అరుణ ముఖ్యఅతిథిగా విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు . కారు మంచి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అరుణ సికందర్ తెలుగు మహిళా నాయకురాలు మేదరమెట్ల పార్వతి అంజమ్మ ఇంకా పొన్నూరు జగదీష్ దర్శి నరసింహారావు ఎం రత్నారెడ్డి అనిల్ అంజి బాబు తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కులతో పాటు మానవ కర్తవ్యాలు కూడా అవసరం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఒంగోలు ఆధ్వర్యంలో"వాక్ ఫర్ హ్యూమన్ డ్యూటీస్" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ వద్ద ఉదయం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రాఫిక్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ మరియు ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రామ్ భూపాల్ రెడ్డి హాజరై, మానవ కర్తవ్యాల ప్రాముఖ్యతపై ప్రసంగించారు.ఈ సందర్భంగా జేసీఐ ఒంగోలు అధ్యక్షుడు శబరీనాథ్ మాట్లాడుతూ, మానవ హక్కులతో పాటు మానవ కర్తవ్యాలు కూడా సమానంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే, జూలై 10 తేదీని అంతర్జాతీయ మానవ విధులు రోజు గా ప్రకటించేందుకు ఐక్యరాజ్యసమితి కు పంపిన పిటిషన్‌పై అందరూ సంతకాలు చేశారు.జేసీఐ సభ్యులు ఈ వాక్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరబ్రహ్మం, జనసేవ శ్రీనివాస్, నూనె వంశీ, వరుణ్, నాగార్జున, బాలకృష్ణ, శివ కోటిరెడ్డి తదితరులు, పూర్వ అధ్యక్షులు మరియు విద్యార్థులు ఇతర సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆన్లైన్ బెట్టింగ్ ముఠా అరెస్టు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**

ఆన్లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను ఒంగోలు తాలూకా పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. ఒంగోలు మండలం గుత్తికొండవారిపాలెం గ్రామానికి చెందిన పల్లపోలు వామనరెడ్డి గతంలో హైదరాబాద్ లో సాఫ్ట్వేర్ ఇంజినీర్ గా పనిచేసి 2023లో ఉద్యోగం కోల్పోయాడు. క్రికెట్ బెట్టింగులు పెడుతూ సుమారు రూ.కోటి వరకు నష్టపోయాడు. అనంతరం ఒంగోలు వచ్చి ఒక నెట్వర్క్ ఏర్పాటు చేసి తిరుపతికి చెందిన ఉపేంద్ర, ఒంగోలుకు చెందిన షేక్ ఆసిఫ్ తో కలిసి ఓ బెట్టింగ్ యాప్లో ఏజెంట్లుగా పనిచేస్తూ పలువురి నుంచి ఆధార్ కార్డులు, ఫొటోలు సేకరించి బెట్టింగ్ లావాదేవీలు నిర్వహించాడు. పక్కా సమాచారంతో తాలూకా సీఐ విజయకృష్ణ ఆధ్వరంలో పోలీసులు దాడిచేసి వీరి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. తొమ్మిది సెల్ఫోన్లు, 15 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెట్వర్క్ పై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామనీ, పట్టుబడిన వారిని అరెస్టు చేపి నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

# వార్డుల పునర్విభజనకు పచ్చజెండా

*- ఒంగోలు నగరంలో కొత్తగా 62 డివిజన్లు*

*- 9 మున్సిపాలిటీలలో వార్డులు పెరగనున్నాయి*

**ఒంగోలు, ప్రభాతవార్త**

నగర, పురపాలక, నగర పంచాయతీల్లో, డివిజన్లు, వార్డుల పునర్విభజనకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు షెడ్యూల్ జారీ చేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలు నగర పాలక సంస్థతో పాటు 9 పురపాలక, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డులు పెరగనున్నాయి. తాజా నిర్ణయంతో ఒంగోలు నగరం ప్రస్తుతం 50 డివిజన్లు ఉన్నా 62 డివిజన్లు కానున్నాయి. చీరాల, కందుకూరు, మార్కాపురం, కనిగిరి, దర్శి, అద్దంకి, చీమకుర్తి, పొదిలి, గిద్దలూరు నగర, పురపాలక, నగర పంచాయతీల్లో కూడా వార్డులు పెరగనున్నాయి. నగర పలక, పురపాలక కమీషన్లు ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతోమున్సిపల్ ఎన్నికలు పోటీకి ఆసక్తి చూపుతున్న పలువురు నాయకులకు రాజకీయ నిరుద్యోగం తీరనుంది. ఇటీవల పాలక వర్గం పదవీ కాలం ముగియడంతో ఆయా నగర పాలక, పురపాలక సంస్థలకు ప్రత్యేకాధికారులను నియమించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభాకు అనుగుణంగా డివిజన్లు, వార్డుల పునర్విభజనకు కూటమి ప్రభుత్వం గత నెల 24న జీవో 64 జారీ చేసింది. ఎంత జనాభాకు ఎన్ని వార్డులు ఉండాల్లో ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. వార్డుల పునర్విభజనకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం గత బుధవారం విడుదల చేసింది. నగర, పురపాలక సంఘాల్లో ఉన్న




జనాభా బౌగోళిక విస్తీర్ణం పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు వార్డులను పునర్విభజన చేస్తూ కమీషనర్లు, ముసాయిదా ప్రతిపాదనలు తయారు చేయాలి. ప్రజల ఆమోదం కోసం ప్రాధమిక నోటిఫికేషన్ జారీ చేసి ఫిర్యాదులు, సూచనలు, స్వీకరించాలి. వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి ప్రభుత్వానికి తుది నివేదిక పంపాల్సి ఉంటుంది. ఆ తరువాత రాష్ట్ర భ్రుత్వం ఫైనల్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. ఈ మేరకు గురువారం నుంచే మున్సిల్ అధికారులు కసరత్తు మొదలు పెట్టినట్లు తెలుస్తుంది. రాజకీయాలపై ఆసక్తి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలన్న తపన ఉన్న అనుకూలమైన డివిజన్లు, వార్డులు లేకపోవడంతో పలువురు యువకులు, నగర, పురపాలక ఎన్నికలకు దూరమవుతున్నారు. వార్డులు కూడా తక్కువ ఉండడంతో ఆశావాహులకు వార్డులు సర్దుబాటు చేయలేక నియోజకవర్గ స్థాయి నుంచి వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాజకీయ నిరుద్యోగులు, ఆశావాహులు ఇది బలే ఛాన్స్ అంటూ అప్పుడే విభజిత వార్డులపై ఫోకస్ పెట్టారు. 1995 నాటి మున్సిపల్ నిబంధనల మేరకు వార్డుల బౌగోళిక స్వరూపాన్ని పరిగణలోకి తీసుకుని పనర్విభజన చేయాలి. వార్డుల విభజన ముసాయిదా, ప్రచురించిన తరువాత ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలి. ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి కూడా అభిప్రాయాలు, సూచనలు స్వీకరించాలి. వార్డుల సరిహద్దులు, బౌగోళిక పరిస్థితులు, ఆ ప్రాంతం యొక్క విశిష్టతను కాపాడుతూ ప్రతిపాదిత వార్డుల్లో జనాభా సమానంగా ఉండేలా విభజించాలి.

**ముసాయిదా తయారీ తుది నోటిఫికేషన్ జారీ షెడ్యూల్:** ఈనెల 2నుంచి 9వరకు ముసాయిదా డ్రాఫ్ట్ తయారు చేయడం, 10న ప్రాధమిక నోటిఫికేషన్ జారీ, 10నుంచి 16వరకు ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలు సేకరణ, 17నుంచి 21వరకు ప్రజల అభ్యంతరాలు, సూచనలు, పరిగణలోకి తీసుకుని వార్డుల విభజన ప్రతిపాదనను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలి. 22నుంచి 25వరకు ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ పరిశీలించి ఆ నివేదికను మున్సిపల్ పరిపాలన కమీషనర్ డైరక్టర్‌కు పంపాలి. 26 నుంచి మే2వరకు ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, జిల్లా కలెక్టర్ల నివేదిక, మున్సిపల్ కౌన్సిల్ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని వార్డుల విభజన ప్రతిపాదన ఆమోదం తుది నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ప్రచురిస్తారు.

## క్రికెట్ బెట్టింగ్ జోలికి వెళ్లొద్దు జీవితాలు నాశనం చేసుకోవద్దు

### - ఎస్పీ హర్షవర్ధన్ రాజు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



అమాయక ప్రజలను, యువతను లక్ష్యంగా చేసుకుని ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని ప్రలోభపెడుతూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో, జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిఘాఉంచినట్లు తెలిపారు.యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమని, ఇది ఆర్థికంగా మరియు సామాజికంగా జీవితాలను నాశనం చేస్తుందని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అవి మోసపూరితంగా ఉండే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు.వినోదం కోసం మాత్రమే క్రికెట్ మ్యాచ్‌లు చూడాలని, బెట్టింగ్ వైపు మొగ్గు చూపకూడదని సూచించారు. బెట్టింగ్ యాప్‌లలో బాల్‌టుబాల్ పందేలు వేసే అవకాశం ఉండటంతో, ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి అత్యాశకు పోకుండా యువత జాగ్రత్తగా ఉండాలని, శ్రమించకుండా వచ్చే డబ్బు వెనుక అనేక నష్టాలు దాగి ఉంటాయని గుర్తుంచుకోవాలని సూచించారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలని, యువత చదువుపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేలా ఉన్నతంగా జీవించాలని సూచించారు. బెట్టింగ్ కేసుల్లో ఇరుక్కొని జీవితాలను నాశనం చేసుకోకూడదని హెచ్చరించారు. అమాయకులను ఆసరాగా చేసుకుని ఎవరైనా డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లపై నిఘా ఏర్పాటు చేసి, ఏపీ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారుజిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 112 కు లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## ఉద్యోగుల పెంగింగ్ బకాయిలు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రికి ఏపీఎన్జీవో అసోసియేషన్ తరుపున కృతజ్ఞతలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఏపీఎన్జీవో అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కే.శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పత్రికా సమావేశంలో జిల్లా అధ్యక్షులు కే.శరత్‌బాబు మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యా సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ కృషితో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.7వేల కోట్లకు పైగా బకాయిలు విడుదలకు ఆమోదం తెలపడం ఉద్యోగులకు ఎంతో ఊరటనిచ్చే సానుకూల చర్య అని పేర్కొన్నారు. బకాయిల విడతల వారీగా చెల్లిస్తున్నప్పటికి, వాటి విడుదల వేగవంతం కావాలని ఉద్యోగులు ఆశిస్తున్నారని చెప్పారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ చెల్లింపుల కోసం మొత్తం రూ.7,059 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపిందని ఆయన వెల్లడించారు. ఈ మొత్తంలో రూ.1,847.83 కోట్లు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ రూ.3,411.03 కోట్లు, గ్రాడ్యూటీ బకాయిలు రూ.1,800 కోట్లు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ రూ.223.47 కోట్లు, పోలీసు సిబ్బందికి అదనపు సరెండర్ లీవ్ చెల్లింపులు ఉన్నాయని తెలిపారు. అలాగే జీపీఎఫ్ కింద రూ.1,847.83 కోట్లు, అలాగే గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ క్రింద ఇప్పటికే విడుదల చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం, పెండింగ్ ఆర్థిక అంశాల పరిష్కారానికి ముందుకు రావడం అభినందనీయమని కే.శరత్ బాబు అన్నారు. జిల్లా కార్యదర్శి ఆర్‌సీ హెచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ పురోగతి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నిరంతర కృషి, రాష్ట్ర ప్రభుత్వ సానుకూల దృక్పధం ఫలితమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు ఏ విద్యా సాగర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణల నేతృత్వంలో ఉద్యోగులకు రావాల్సిన రాయితీలు అన్ని సాధించుకుంటామన్న నమ్మకం ఉంది అన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కే.శివ కుమార్, సహా అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పి.మాధవి, ఉపాధ్యక్షులు బి.ఏడుకొండలు, తోట శ్రీనివాసు, పి.రామాంజనేయులు, ఆర్ దీపక్ కుమార్, బి.విజయ్ కుమార్, కే.కోటేశ్వరమ్మ, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి బి.కృష్ణ కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు(వాసు) డి.వెంకటేశ్వర్లు, డి.మధుసూదనరెడ్డి, కే.రాజేష్‌బాబు, వి.హరిబాబు, ఒంగోలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్, కార్యదర్శి షేక్ మగ్ధుం షరీఫ్, జిల్లా కన్వీనర్ సీహెచ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## జనాభాగణనలో భాగస్వామ్యు లౌదాం

### : తహసిల్దార్ సింగారావు

**జె.పంగులూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

పలు రకాల సంక్షేమ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వం నిర్వహించే జనాభా గణన లో ప్రజలంతా కలిసి భాగస్వామ్యులౌదామని మండల తహసిల్దార్ పి. సింగారావు అన్నారు. మండలంలోని తాసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం తాసిల్దార్ పి. సింగారావు మాట్లాడుతూ మే ఒకటి నుండి 30వ తారీకు వరకు నిర్వహించే జనాభా గణన లో పూర్తిగా మీ ఇంటి వివరాలు సక్రమంగా తెలియపరచాలన్నారు. వివరాలు గోప్యంగా, సురక్షితంగా ఉంచబడతాయని, డైరెక్ట్ రేట్ ఆఫ్ సెన్సెక్స్ ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో వారు అందించిన క్యూఆర్ కోడ్ ద్వారా ఏప్రిల్ 16 నుండి 30వ తారీకు వరకు ప్రజలు వారి మొబైల్ ఫోన్ల ద్వారా స్వయంగా వారి వివరాలను ఆన్లైన్లో భర్తీ చేసుకోవచ్చు నన్నారు. జనాభా లెక్కల వారు వచ్చినప్పుడు స్వీయ గణన ఐడిని వారికి అందించి వారి మీ పూర్తిగా సహకరించాలన్నారు.

## చీరాలలో వైభవంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**చీరాల టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



పట్టణంలో గుడ్ ఫ్రైడే వేడుకలు క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించారు. శుభ శుక్రవారం సందర్భంగా చీరాల పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించగా, మరియమ్మపేటలోని పునీత ఆంతోని వారి దేవాలయం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యేసుక్రీస్తు శిలువలో అనుభవించిన శ్రమలను స్మరించుకుంటూ సిలువ మార్గం ఘటనలను భక్తులకు కళ్లకు కట్టినట్లు సిలువ మోస్తూ వివరించారు. ఈ సందర్భంగా దేవాలయం ఫాదర్ జగన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గుడ్ ఫ్రైడే వేడుకలను విశేషంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లోక రక్షణ కోసం యేసుక్రీస్తు చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ సిలువ మోసిన సమయంలో జరిగిన సంఘటనలను వివరించారు. దేశంలో శాంతి, ప్రేమ, కరుణ, దయ వంటి విలువలు ప్రతి ఒక్కరిలో పెంపొందాలని సూచించారు. సమాజంలో పెరుగుతున్న అన్యాయం, అవినీతిని నిర్మూలించేందుకు క్రీస్తు త్యాగం మార్గదర్శకమన్నారు. క్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించి పాప మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి మరియమ్మపేట పునీత ఆంతోని దేవాలయం వరకు 14 గుర్తులు ఏర్పాటు చేసి సిలువ మార్గాన్ని ప్రదర్శించారు. అయితే మండే ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు శ్రద్ధగా సిలువ ధ్యాన్యం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో చర్చ్ ఫాదర్‌లు, సిస్టర్‌లు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న జింకను కాపాడిన గ్రామస్తులు

**వేటపాలెం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



వేటపాలెం మండలం రామన్నపేట గ్రామంలో జింక కనిపించడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి కుక్కలు తరుముతున్న జింక కనిపించడంతో వెంటనే అప్రమత్తమై కుక్కలను తరిమి దానిని పట్టుకుని స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అనంతరం జింకను అటవీశాఖ అధికారులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. అడవి జంతవులు గ్రామాల్లోకి రావడం అరుదైన విషయం కావడంతో గ్రామస్తులు ఆసక్తిగా గమనించారు. అధికారులు జింకను సురక్షితంగా అడవిలో విడిచిపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## పాము కాటుతో గిరిజన యువకుడి పరిస్థితి విషమం

### - మార్కాపురం జిల్లా కేంద్ర వైద్యశాలకు తరలింపు

**యర్రగొండపాలెం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



యర్రగొండపాలెం మండలం గాంధీనగర్ చెంచు గూడెంలో కుడుముల అంకన్న అనే గిరిజన యువకుడికి పాము కాటు వేసింది. రోజు వారీ పనుల కోసం చెంచు గూడెంలో తిరుగుతున్న సమయంలో అంకన్నను ఒక్క సారిగా పాటు కాటు వేసినట్లు బంధువులు చెప్తున్నారు. పాము కాటు వేసిన వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, బంధువులు ఆలస్యం చేయకుండా హుటాహుటీన అంకమ్మను యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తలరించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తూ పరిస్థితిని పర్యవేక్షించారు. అయితే అంకన్న ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు సూచించారు. దీంతో బంధువులు అంకన్నను మార్కాపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అక్కడ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తక్షణ వైద్యసదుపాయలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పాము కాటు వంటి ప్రమాదకర ఘటనల్లో వెంటనే ఆసుపత్రికి తరలించడమే ప్రాణాలను కాపాడుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

## సిబ్బంది నిర్లక్ష్యంతో ఆగిన చిన్నారి పసిప్రాణం

**యర్రగొండపాలెం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**




యర్రగొండపాలెం ప్రభుత్వ దవాఖానాలో సిబ్బంది నిర్లక్ష్యంతో ఆగిన చిన్నారి ప్రాణం, పురిటి నొప్పులతో కాన్పు కోసం పుల్లలచెరువు మండలం గంగవరం గ్రామం నుంచి వచ్చిన మహిళ ఆసుపత్రిలో చేరింది. మరుసటి రోజు కాన్పులో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డక్షేమం అయితే ఆ బిడ్డ రాత్రి నిదుర మత్తులో తన పక్కన నిదురిస్తున్న పసికందుపై చేతులు వేసుకొని నిదురపోవడంతో తల్లి చేతుల బరువును మోయలేని ఆ పసిప్రాణం ఆ తల్లి గాఢ నిద్రలో ఉండగానే ఊపిరి వదిలేసింది. ఈ దారుణ ఘటన యర్రగొండపాలెం పట్టణం ప్రభుత్వ ధర్మాసుపత్రిలోని కాన్పుల వార్డులో శుక్రవారం చోటు చేసుకుంది. పసి బిడ్డను అక్కున చేర్చుకొని నిదుర పోయిన తల్లి, ఆ తల్లి చేతుల బరువుకే తన మూడు రోజుల పాప ప్రాణాలను వదిలేసిన సంగతి తెలుసుకున్న తల్లి విల విల లాడిపోయింది. సిబ్బంది నిర్లక్ష్యం ఓ పసికందు ఉసురు తీసింది. దాంతో పురిటి బిడ్డ పురుటిలోనే చనిపోవడంతో ఆ తల్లికి కడుపు కోత మిగిల్చింది. మూడు రోజుల పసికందు నిదురలో తల్లి చేతుల బరువు మీద పడటంతో ఊపిరి అందక ప్రాణం వదలడంతో అక్కడి ఆ పరిసరాలు విషాధ ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు కారణం ముమ్మాటికి సిబ్బంది నిర్లక్ష్యమే అని ఆ నిర్లక్ష్యం పసికందు మరణానికి కారణమని కాన్పు తరువాత వెంటనే ఆ రాత్రి తల్లి బిడ్డను వేరు చేసి ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ఘనంగా చెన్నకేశవస్వామి శాంతి కళ్యాణం



**బల్లికురవ, మార్చి 3, ప్రభాతవార్త**
శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి శాంతి కళ్యాణం మండలంలోని కొనిదేన గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రారంభించిన ఈ శాంతి కళ్యాణ వేడుకలో మూలమూర్తికి పంచామృత అభిషేకం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, కంకణ ధారణ, కార్యక్రమాలను తిరుమల తిరుపతి దేవస్థానం యాగ్నిక స్వాములచే అత్యంత వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. యాగ్నిక స్వామి వెంకట పవన కృష్ణమాచార్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్ప వృక్షంగా, అత్యంత చారిత్రక ఆలయాలలో కొంగు బంగారమై బాసిల్లుతూ భక్తుల పూజలు అందుకునేటువంటి శ్రీదేవి, భూదేవి సమేత స్వయంభు చెన్నకేశవస్వామి ప్రాధాన్యతను వివరించారు. స్వామివారి వక్షస్థలంలో లక్ష్మీదేవి పాదపీఠం వద్ద ఇరుదేవేరులు కొలువై ఉండడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది అని వివరించారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చేవాడిగా, సకల ఐశ్వర్యాలు ప్రసాదించేవాడిగా చెన్నకేశవస్వామి ప్రసిద్ధిచెందాడన్నారు. ఇక్కడ పూజలు, కళ్యాణాలు, జరపటం వల్ల శారీరక, మానసిక కష్టాలు తొలగిపోతాయి. ప్రధాన అర్చకులు ఐవీఎంఎస్ ఆచార్యులు, చెన్నకేశవస్వామి ఆలయ పునర్ నిర్మాణ కమిటీ సభ్యులు, కొనిదేన వేమవరం, నాగరాజుపల్లి గ్రామాలకు చెందిన స్వామివారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య భరోసాగా ఎమ్మెల్యే ఏలూరి

**- 5 మందికి రూ.7.20 లక్షల ఎల్ఓసీ చెక్కులు**
**- ఒక్క రోజులోనే మంజూరు చేయించి సేవాభావం**
**- ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**



**మార్టూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
పేదల ఆరోగ్య సమస్యలపై తక్షణమే స్పందిస్తూ ప్రభుత్వ సహాయాన్ని వేగంగా అందించే విషయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మరోసారి తన సేవాదృక్పథాన్ని చాటుకున్నారు. నియోజకవర్గానికి చెందిన ఐదుగురు బాధితులకు అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి(ఎల్ఓసీ) ద్వారా మొత్తం సుమారు రూ.7.20 లక్షల ఆర్థిక సహాయాన్ని ఒక్క రోజులోనే మంజూరు చేయించి వారి కుటుంబాలకు పెద్ద ఊరట కలిగించారు. చింతగుంపలి గ్రామానికి చెందిన 80 ఏళ్ల చెల్లా నాగేశ్వరరావు పక్షవాతం కారణంగా నడుమ భాగం నుంచి కాళ్లు పని చేయని స్థితిలో ఉండగా, ఒంగోలు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్స అవసరమని సూచించారు. ఈ విషయం స్థానిక టీడీపీ నాయకుడు యార్లగడ్డ సత్యనారాయణ ద్వారా ఎమ్మెల్యే దృష్టికి చేరడంతో, వెంటనే స్పందించిన ఆయన రూ.1,99,782 ఎల్ఓసీ మంజూరు చేయించారు. నూతలపాడు గ్రామానికి చెందిన నూతలపాటి తిరుపతయ్య(60) కుడికాలికి గాయం తీవ్ర ఇన్ఫెక్షన్‌గా మారి గుంటూరులో చికిత్స పొందుతుండగా పీఏసీఎస్ అధ్యక్షుడు విన్నకోట సతీష్ ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఏలూరి తక్షణమే చర్యలు తీసుకుని రూ.1,62,699 ఎల్ఓసీ మంజూరు చేయించారు. మార్టూరు గడ్డం బజార్‌కు చెందిన షేక్ ఖాదర్ బీ గర్భసంచి సమస్యతో చిలుకలూరిపేటలో చికిత్స పొందుతూ శస్త్ర చికిత్స అవసరమైన పరిస్థితుల్లో ఉండగా స్థానిక నాయకుడు షేక్ రజాక్ విన్నవించగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.99,157 ఎల్ఓసీ మంజూరైంది. పెద్దగంజాం మండలం ఏటిమొగ గ్రామానికి చెందిన ప్రళయకావేరి తిరుపతి రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయి తీవ్రంగా గాయపడగా, ఆయన చికిత్స కోసం రూ.1,80,916 ఎల్ఓసీ అందించారు. ఇంకొల్లు మండలం తాటిపర్తివారిపాలెం గ్రామానికి చెందిన బత్తుల గోవిందమ్మ వెన్ను పూస నరాల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుండగా ఆమె చికిత్స నిమిత్తం రూ.77,754 ఆర్థిక సహాయం మంజూరు చేశారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి తక్షణ స్పందనతో సహాయం అందించడంపై బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్యమే ప్రధానమని భావిస్తూ, అవసరమైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరుపున సహాయం అందించడం తన బాధ్యతగా కొనసాగిస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.

# డివైడర్‌ను ఢీకొన్న కారు : తప్పిన ప్రమాదం



**బల్లికురవ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
అద్దంకి నర్కట్‌పల్లి రహదారిలో మండలంలోని వైదన వద్ద శుక్రవారం అద్దంకి నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు బాగంలోని రెండు టైర్లు విరిగిపోయాయి. ప్రమాద సమయంలో కారులోని ముగ్గురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కదిరి బ్రదర్స్



**సీఎస్‌పురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
శీలంవారిపల్లి గ్రామానికి చెందిన వాక ఉమామహేశ్వరరావు కుమార్తె శిరీష, సురేష్ నాయుడుల వివాహ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకలో కదిరి బాబురావు విద్యాసంస్థల చైర్మన్ కేవీ ప్రకాష్‌రావు, సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారధి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి కృష్ణ, టి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్‌ఫ్రైడే రోజున మేఘాలలో సిలువ ఆవిష్కృతం

**- క్రైస్తవులలో ఆధ్యాత్మిక ఆనందం**



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన గుడ్ ఫ్రైడే రోజున శుక్రవారం ఆకాశం మేఘాల మధ్య సిలువ ఆకారం కనిపించడం విశేషంగా నిలిచింది. ఈ అపూర్వ దృశ్యం స్థానిక ప్రజలను ఆశ్చర్యానికి గురి చేయడమే కాకుండా క్రైస్తవ విశ్వాసుల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది. ఉదయం ప్రార్థనల అనంతరం కొంత మంది ఆకాశాన్ని గమనించగా మేఘాలు సహజంగా ఏర్పడి సిలువ ఆకారాన్ని ప్రతిబింబించాయి.ఈ దృశ్యాన్ని చూసిన కొందరు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ ఘటన కొద్దిసేపే కనిపించినప్పటికి వారిలో అది ఒక దైవ సూచనగా భావన కలిగించింది. గుడ్‌ఫ్రైడే రోజున సిలువ ఆకారం ఆవిష్కృతం కావడం ఏసుక్రీస్తు మనుషుల పాపాల కోసం సిలువపై ప్రాణ త్యాగం చేసిన విషయాన్ని ఈ దృశ్యం మనకు గుర్తు చేస్తుంది. ఇది విశ్వాసాన్ని బలపరిచే ఆధ్యాత్మిక అనుభూతిని కొందరు అంటున్నారు. ఈ ఘటనను దేవుని కృపగా భావిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# అమరావతికి చట్టబద్ధత

**- రైతుల పోరాటానికి గౌరవం - మోడీ చిత్రపటానికి పాలాభిషేకం**



**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని గడియాస్తంభం కూడలి వద్ద శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు రాజా శ్రీకాంత్ మాట్లాడుతూ అమరావతికి చట్టబద్ధత లభించడం అనేది రైతుల దీర్ఘకాల పోరాటానికి దక్కిన నిజమైన గౌరవమని అన్నారు. గత ఐదేళ్లుగా మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా భూములు ఇచ్చిన రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేసిన పరిస్థితులకు ఇక ముగింపు పలికిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి సహకారంతో అమరావతిని రాష్ట్ర రాజధానిగా ఉభయ చట్టసభల్లో ఆమోదించడం రాష్ట్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి కృషి చేసిన కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, షేక్ షబానా, జి సతీష్, నాగరాజు, శ్రీను తదితర సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కంభం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**
కంభం 132/33 కెవి సబ్ స్టేషన్ నందు మరమ్మత్తుల దృష్ట్యా శనివారం ఉదయం 6:30గంటల నుండి11.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏ.డి. శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కంభం మండలంతోపాటు బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల పరిధిలోని అన్ని సబ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో శ్రద్ధ చూపండి

**- వార్త ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ గౌరవ్ సంఘీ**



**బల్లికురవ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
ప్రజా సమస్యల పరిష్కారంలో వార్త దినపత్రిక పాత్రికేయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వార్త దినపత్రిక ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ గౌరవ్ సంఘీ అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ఒంగోలు, గుంటూరు, విజయవాడ, తాడేపల్లిగూడెం పాత్రికేయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఏ రాజకీయాలతో సంబంధం లేని ఏకైక దినపత్రిక వార్త దినపత్రిక. వార్త పత్రిక ప్రజల పక్షం వహిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ అక్షర గళం వినిపించాలన్నారు. నిజాన్ని నిర్భయంగా వెలికితీస్తూ ఆధారాలతో సహా బహిర్గతం చేస్తే అలాంటి సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుంది అన్నారు. గ్రామీణ ప్రాంత పాత్రికేయులు నిత్య నూతన వరవడితో ప్రత్యేక కథనాలు వెలువరించడంతో పాటు, అధికార యంత్రాంగం దృష్టికి సమస్యలను తీసుకురావడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఎడిటర్ సాయిబాబా మాట్లాడుతూ సర్వకాల సర్వవస్థలలోనూ వార్త దినపత్రిక ప్రజల పక్షపాతిగా రెండు తెలుగు రాష్ట్రాలలో తన ప్రాధాన్యతను చాటుకుంటుందన్నారు. పాత్రికేయులు తమ వృత్తి నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మరింతగా పెంపొందించుకుంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో తమ ప్రాధాన్యతను చాటాలన్నారు. నెట్వర్క్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు మాట్లాడుతూ ఏ పత్రికలలో లేని స్వేచ్ఛ, స్వాతంత్రం, వార్త యాజమాన్యం పాత్రికేయులకు కల్పించిందని, యాజమాన్యం అందించిన సహకారంతో మరింత వృత్తి నైపుణ్యాన్ని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అల్లూరిరెడ్డి, పలువురు సీనియర్ పాత్రికేయులు తమ మనోభావాలను వెల్లడించారు. అనంతరం గౌరవ్ సంఘీని ఘనంగా సన్మానించారు.

## సంగిశెట్టి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న బోయళ్ళ



**సీఎస్‌పురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన సీఎస్‌పురంలోని సంగిశెట్టి రమణయ్య నారాయణమ్మ కుమార్తె శ్రావణి వివాహ వేడుక శుక్రవారం జరిగింది. వివాహ వేడుకలో టీడీపీ నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి పాల్గొని నూతన వధువు శ్రావణిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు ఓనర్ పోకల మాలకొండయ్య జర్నలిస్టు సంగిశెట్టి పీరయ్య నాయుడు, టీడీపీ నాయకులు చీప్ శ్రీను తదితరులు ఉన్నారు.

# నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

**సీఎస్‌పురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మండలంలోని ప్రధానోపాధ్యాయులకు శనివారం ఉదయం 11గంటలకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 రాజాల కొండారెడ్డి తెలిపారు. మండలంలోని మోడల్ ప్రైమరీ, ప్రాధమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరూ ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

# ఏసుక్రీస్తు చేసిన త్యాగాలు మరువలేనివి





**పుల్లలచెరువు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన పుల్లలచెరువులో వందల సంఖ్యలో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. యేసుక్రీస్తు సిలువపై చేసిన మహత్యాగాన్ని స్మరించుకుంటూ మండలంలోని పలు చర్చిల్లో విశేష ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే చర్చిలకు చేరుకున్న భక్తులు ప్రార్థనలు చేస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. యేసుక్రీస్తు శ్రమలు, సిలువ మార్గంలో ఆయన ఎదుర్కొన్న బాధలను స్మరించుకుంటూ విశ్వాసులు మౌనంగా ప్రార్థనలు చేశారు. కీర్తనలు ఆలపిస్తూ భక్తులు ఆరాధనలో పాల్గొని తమ భక్తి భావాన్ని వ్యక్తపరిచారు. అదే విధంగా యేసు నామకరణ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు ఆధ్యాత్మికంగా సాగాయి. ఈ సందర్భంగా పాస్టర్ ఆర్.ఆనందరావు సందేశం ఇస్తూ యేసు ప్రభువు జీవితం మానవాళికి మార్గదర్శకమని అన్నారు. ప్రేమ, కరుణ, ప్రేమ, సహనం, త్యాగం వంటి మహత్తర విలువలను యేసుక్రీస్తు తన జీవితం ద్వారా ప్రపంచానికి బోధించారని తెలిపారు. శత్రువులను సైతం ప్రేమించాలి, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలి అనే ఆయన బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. గుడ్ ఫ్రైడే సందేశం కేవలం ఆరాధనకు పరిమితం కాకుండా, మన జీవిత విధానాన్ని మారుస్తుందనే అంశాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సమాజంలో పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందించుకోవడం, అవసరంలో ఉన్న వారికి చేయూతనివ్వడం ద్వారా యేసు బోధించిన మార్గాన్ని అనుసరించవచ్చని పేర్కొన్నారు. చర్చిల పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొని,యేసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ విశ్వాసులు ఆత్మపరిశీలనలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘస్తులు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మంగమ్మ తల్లి తిరునాళ్ల ప్రదేశాన్ని సందర్శించిన ఎస్సై మాధవరావు



**హనుమంతునిపాడు, ఏప్రిల్ 3 ,ప్రభాతవార్త**
మండల పరిధిలోని మంగమ్మ తల్లి గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ మంగమ్మ తల్లి సమేత గరటయ్య స్వామి వార్ల తిరునాళ్ల మహోత్సవాలు ఈనెల 2నుండి 4వ తేదీ వరకు జరగనుండగా శుక్రవారం ఎస్సై మాధవరావు అక్కడికి చేరుకుని తిరునాళ్ల ప్రదేశాన్ని సందర్శించి ఆ ప్రాంతంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై కమిటీ సభ్యులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా రహదారి ప్రమాదాలను నివారించే ఉద్దేశంతో, పంచాయతీ అధికారుల సహకారంతో వాలిచెర్ల గ్రామం నుండి మంగపల్లి గ్రామం వరకు రహదారి పక్కన ఉన్న పొదలను తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెద్దదోర్నాలలో ఘనంగా గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
క్రైస్తవుల ఆరాధ్య పర్వదినమైన గుడ్ ఫ్రైడేను పెద్దదోర్నాలలోని చర్చిలలో శుక్రవారం ఘనంగా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుంచే విశ్వాసులు చర్చిలకు తరలివచ్చి ఏసుక్రీస్తు సిలువ వేదనలను స్మరించుకుంటూ ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు త్యాగం, ప్రేమ, క్రియాశీలతపై సందేశాలు అందించారు. సిలువలో యేసు పిలికిన 7 మాటలను విశ్వాసులకు వివరిస్తూ మానవాళి పాప విమోచన కోస ఆయన చేసిన త్యాగాన్ని గుర్తు చేశారు. విశ్వాసులు ఆత్మతోను సత్యములోను ఆరాధన చేస్తూ ఆధ్యాత్మిక వాతావరణంలో నిమగ్నమయ్యారు. దోర్నాల ఆర్‌సీఎం, లూథరన్, బాప్టిస్టు చర్చి లివింగ్ ఫెలోషిప్, హల్లెలూయ ప్రార్థన మందిరం, హోరేబు చర్చి, బ్రదరన్ అసెంబ్లీ, యేసు వచ్చుచున్నాడు. పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు పవిత్రంగా జరిపారు.

# అమ్మా.. గంగమ్మా..!

**- వైభవంగా గుంటిగంగ తిరునాళ్ల - అమ్మవారికి ప్రత్యేక పూజలు**
**- సామాజిక వర్గాల వారీ పలు సత్రాలలో అన్నదానం**





**తాళ్లూరు, ఏప్రిల్ 3,ప్రభాత వార్త**
జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుంటిగంగ తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగింది. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొనిగంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. అధికసంఖ్యలో మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మకు పశుజాతిని బలి ఇచ్చి సకాలంలో వర్షాలు కురిపించి కాపాడుఅంటూ వేడుకున్నారు. భక్తులు పశుసంపదను, వాహనాలను తీసుకొచ్చి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు జరి పారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన అన్న దాన సత్రాల వద్ద వేలాది మందికి అన్నదాన కార్యక్ర మాలు నిర్వహించారు.జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి,జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా టీడీపీ,వైఎస్సార్ సీపీ, జనసేన, పార్టీల ఆధ్వర్యంలో తొమ్మిది విద్యుత్ ప్రభలు ఏర్పాటయ్యాయి.డీఎస్పీ లక్ష్మి నారాయణ, సీఐ వై. రామారావు, ఎస్ఐ మల్లికార్జున రావు, ఆలయ చైర్మన్ సానె సురేష్, ఈవో నర్రా నారాయణ రెడ్డి లు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. బూచేపల్లి వెంట రాష్ట్ర సంయుక్త కార్యదర్శి,మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్ రెడ్డి, వైకాపా మండల అధ్యక్షులు తూము వెంకట సుబ్బారెడ్డి,నాయకులు గూడా శ్రీధర్ రెడ్డి (ఎన్ఆర్ ఐ) ,భీమిరెడ్డి నాగ మల్లేశ్వరరెడ్డి, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి(గోల్డ్ ),గూడా ప్రసాద్ రెడ్డి, ఐ.గోపి,కటకంశెట్టి శ్రీనివాసరావులు,ఉన్నారు.

## 588 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులతో డీఈవో సమావేశం నిర్వహించాలి : ఏపీటీజీ నాయకులు

**సింగరాయకొండ, ఏప్రిల్ 3,ప్రభాతవార్త**
ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న 134 ఎయిడెడ్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 588 మంది ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) సి.వి. రేణుక తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ (త్పిగిబి) జిల్లా అధ్యక్షుడు కె. వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.ఉపాధ్యాయుల సమస్యలు సుమారు 40కి పైగా ఉన్నాయని, ముఖ్యంగా ఇంక్రిమెంట్ల సమస్య, కోర్టు పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపు, జాయినింగ్ సమయంలో యాజమాన్యాలు మరియు మండల విద్యాశాఖ అధికారులతో ఏర్పడుతున్న ఇబ్బందులు ప్రధానంగా ఉన్నాయని తెలిపారు.అలాగే ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ **(FLN)** మెటీరియల్, క్రీడా సామగ్రి, కౌన్సెలింగ్ వంటి అంశాల్లో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు కనుగొనేందుకు డీఈవో, మండల విద్యాశాఖ అధికారులు, యూనియన్ ప్రతినిధులతో సమగ్ర సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీటీజీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇవ్వాలి



**పొన్నలూరు ఏప్రిల్ 3 ,ప్రభాతవార్త**
అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇవ్వాలని రాష్ట్ర వైఎస్ఆర్సీపి వాణిజ్య విభాగం కార్యదర్శి సిరిగిరి గోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తి కావస్తోందని నేటికీ కొత్త పెన్షన్ల కోసం అర్హులు ఎదురు చూపులు చూడాల్సి వస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం భర్త చనిపోతే భార్యకి పెన్షన్ ఇవ్వడం తప్ప ఇప్పటి వరకు ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని ఎద్దేవ చేశారు.అర్హత కలిగిన వారందరికీ సంతృప్త స్థాయిలో పెన్షన్లు ఇవ్వడం అనే కార్యక్రమం ఒక్క వైఎస్ఆర్ కుటుంబానికి మాత్రమే సాధ్యమవుతుందన్నారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఇందిరమ్మ ఆదర్శ గ్రామం కింద లబ్ధిదారులు ఎంత మంది ఉన్నా కూడా పెన్షన్ ఇవ్వడం జరిగిందని, 2019 తర్వాత అప్పటి వైసీపీ ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా ప్రతి గడప తిరిగి ఐదు సంవత్సరాలలో అత్యధిక పింఛన్లు ఇచ్చిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని కొనియాడారు. ఆ తర్వాత 2024 లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిలో కూడా రెండు లక్షల పింఛన్లు తొలగించి ఇప్పుడు కేవలం 60 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇస్తున్నారన్నారు. కానీ రెండు సంవత్సరాల నుండి ఎంతో మంది వితంతు, వికలాంగులు, వృద్ధులు పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారని కూటమి ప్రభుత్వం కనీసం ఆన్లైన్ దరఖాస్తు కూడా స్వీకరించే పరిస్థితిలో లేదన్నారు.జూన్ నెల 4వ తేదీ నాటికి కూడా కొత్త పెన్షన్లు ఇవ్వకపోతే మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ సూచన మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లోని అర్హత కలిగిన వారందరితో మండల ఎంపీడీవో, జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

# క్రీస్తు బోధనలే మనకు మార్గదర్శకం

**- సిలువ యాత్రలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**





**దర్శి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
గుడ్‌ఫ్రైడే పర్వదినం సందర్భంగా దర్శి పట్టణం, పొదిలి రోడ్డులోని సెయింట్ జేవియర్స్ చర్చి నందు శుక్రవారం సాయంత్రం ఫాస్టర్ బాల సౌరీతో పాటు కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. లోక రక్షకుడు యేసుక్రీస్తు త్యాగానికి ప్రతీకగా జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలు దర్శి పట్టణం, పొదిలి రోడ్డులోని సెయింట్ జేవియర్స్ చర్చి నందు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. క్రైస్తవ సోదరులు చేపట్టిన సిలువ యాత్రలో దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొని, భుజంపై సిలువను మోసి తన భక్తి ప్రవత్తులను చాటుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే మానవాళి కోసం యేసుక్రీస్తు చేసిన అపారమైన త్యాగాలను మనకు గుర్తుచేస్తుందని, లోక పాపాలను కడిగివేసేందుకు ఆయన మరణాన్ని సైతం చిరునవ్వుతో ఆహ్వానించారని కొనియాడారు. మన ప్రవర్తన ద్వారా క్రీస్తు త్యాగాన్ని గౌరవిస్తూ సమాజంలో ప్రేమ, శాంతి, దయను వ్యాప్తి చేయాలని, ఈ పవిత్రమైన రోజున క్రీస్తు బోధనలను స్మరిస్తూ ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడవాలని ఆమె పిలుపునిచ్చారు. క్రీస్తు చూపిన ప్రేమ మార్గం అందరికి ఆదర్శనీయమని, తోటివారి పట్ల దయతో మెలగడమే దేవునికి ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొంటూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో క్రైస్తవ మత పెద్దలు, విశ్వాసులు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసీ చైర్మన్‌దారం నాగవేణి సుబ్బారావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, దర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నిపూడి స్టీవెన్, శోభారాణి, ఎస్సీ సోదరులు, కూటమి శ్రేణులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు



**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, దళితుల హక్కుల పరిరక్షకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి కార్యక్రమాన్ని ఈనెల 5వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ప్రభుత్వం ఈ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించనున్నారు.ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు ప్రముఖులు ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, షెడ్యూల్ కులాలు మరియు షెడ్యూల్ తెగల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కలెక్టర్ తన ప్రకటనలో కోరారు.

## గుమ్మలంపాడులో ఉపాధి పనులు పరిశీలించిన ఎంపీడీవో సురేష్‌బాబు

**సంతనూతలపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడు గ్రామంలో శుక్రవారం నాడు జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. ఉపాధి కూలీలు ప్రతి రోజు పనికి రావాలని, ఉపాధి కూలీలకు ఎంపీడీవో సురేష్‌బాబు అవగాహన కల్పించారు. ప్రతి రోజు ఉపాధి కూలీలచే టార్గెట్ ప్రకారం పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, పంచాయతీ అభివృద్ధి అధికారి ఎన్.ప్రతాప్ కుమార్, గుమ్మలంపాడు టీడీపీ అధ్యక్షులు బొడ్డపాటి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు నెప్పలి కనకయ్య, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



7_7.qxd 4/4/2026 12:59 AM Page 1



## శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు




**రాచర్ల ఏప్రిల్ 3 ప్రభాతవార్త**
మండలంలోని జెపి చెరువు అటవీ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కళ్యాణ కార్యక్రమం నిర్వహించగా మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో నాగయ్య కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు ఆలయ మర్యాదలతోఘన స్వాగతం పలికారు. ఆలయ పూజారులు వారి చేత పూజలు చేయించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు అనంతరం కలెక్టర్ విజయ సునీత ఆలయ విశిష్టత చరిత్ర గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు జరిగే చెప్పోత్సవం గురించి తెలుసుకొని అందుకు తగ్గ భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్, రాచర్ల తహసిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## నూతన కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి



**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం విజయ సునీతను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినందుకు ఎంపీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురూ చర్చించారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాల అమలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి ప్రాజెక్టులు, తాగునీటి సమస్యలు, రహదారుల మెరుగుదల, వ్యవసాయం, విద్య, వైద్యం వంటి రంగాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రైతులకు అవసరమైన సదుపాయాల కల్పన, యువతకు ఉపాధి అవకాశాల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ సూచించారు. అదేవిధంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు అందించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. జిల్లాలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ హామీ ఇచ్చారు.

## దేశమంతా విస్తరించిన కరివేన సత్ర సేవలు

### - నూతన నాయకత్వానికి ఘన సత్కారం



**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాల్లో వసతి, అన్నదానం, వేదపాఠశాలలు, గోశాలల నిర్వహణతో విశిష్ట సేవలు అందిస్తోంది. తిరుపతిలో జరిగిన ఎన్నికల్లో కోశాధికారిగా గోపాలుని హరిహర రావు, జాయింట్ సెక్రటరీగా కాళంరాజు రామకృష్ణ (అగ్ని రిపోర్టర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మార్కాపురంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో బ్రాహ్మణ పెద్దలు వారికి ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌జిఓ అధ్యక్షుడు బివిఎస్ శాస్త్రి, ఆర్టీసీ నాయకుడు సోమయాజుల శాస్త్రి, కలవలపూడి శ్రీనివాసరావు (చిప్స్ శ్రీను), గోపాలుని రమేష్, మాజీ సైనికుల కార్యదర్శి సాయి, పీవీఎల్ఎన్‌వీ నాగరాజు, మల్లయ్య (రిటైర్డ్ డీటీ), సాయిబాబా, కృష్ణ, కేశవరావు పాల్గొన్నారు.అలాగే కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రామడుగు గోపి, జాయింట్ సెక్రటరీ చల్లా పవన్, షేక్ ఖరీం, విజయ్, కృష్ణమోహన్ తదితరులు నూతన నాయకత్వాన్ని అభినందించారు. భవిష్యత్తులో అయోధ్య, అన్నవరం, తిరుమల, కాళేశ్వరం వంటి ప్రాంతాల్లో సత్రాలు విస్తరించనున్నట్లు గోపాలుని హరిహర రావు, కాళంరాజు రామకృష్ణ తెలిపారు.

## గుడ్ ఫ్రైడే సందర్భంగా సేవా స్ఫూర్తి చాటిన యువత

### - నగర్ చర్చ్ వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ



**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
గుడ్ ఫ్రైడే సందర్భంగా మార్కాపురంలోని తెలుగు బాప్టిస్ట్ నగర్ చర్చ్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నగర్ చర్చి సమీపంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి హాజరై మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే యొక్క ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రతి కుటుంబం ఆచరణలో పెట్టాలని, యేసు క్రీస్తు ప్రభువు చెప్పిన ఏడు మాటలను జీవితంలో అనుసరించి శాంతి, సమాధానం, సంతోషంతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో నగర్ చర్చి పాస్టర్ డాక్టర్ పి ఆంద్రూస్ ప్రార్థనలు నిర్వహించారు. అలాగే చర్చి ప్రెసిడెంట్ పల్లె పోగు దేవిడ్, సెక్రటరీ నాగేళ్ల యోవేలు, ట్రెజరర్ వంగూరి జోసెఫ్ రాజ్, జాయింట్ సెక్రటరీ ముత్యపోగు ఏలియా, స్టాండింగ్ కమిటీ సభ్యులు కూరపాటి జకరయ్య, నార్లపాటి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీబీఎన్‌సి యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పించండి

### - స్పందన వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి




**రాచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**
పేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పించాలని శాసన సభ్యులు ఎం అశోక్ రెడ్డి అన్నారు. రాచర్ల స్పందన విద్యాసంస్థ 35వ వార్షికోత్సవ కార్యక్రమం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి అధ్యక్షతన గత గురువారం నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఎన్నో ఇబ్బందులు ఒడిదుడుకులు ఎదుర్కొని 35 సంవత్సరాలు పాఠశాల నిర్వహణ గొప్ప విషయమని అన్నారు. స్పందన విద్యా సంస్థ ఉత్తమ విద్యుత్‌తో పాటు మంచి ఫలితాలు సాధిస్తూ జిల్లా రాష్ట్ర స్థాయిల్లో గుర్తింపు తెచ్చుకుందని ఆ గుర్తింపును అలాగే కొనసాగించుకోవాలని అన్నారు. అందరికీ అందుబాటులో ఉండే ఫీజులతో మంచి విద్యను అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు గిరిధర్ శర్మ, అశ్విని కుమార్, మొయినుద్దీన్, నాయకులు యోగానంద్, జీవనేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బైలడుగు బాలయ్య, రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రంగనాయకస్వామి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

### - రంగస్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి

**రాచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**
శ్రీ నెమలిగుండ్ల రంగ నాయక స్వామి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన రంగస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ముందుగా ఆయన స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డితో కలిసి ఆలయంలోని నీటి గుండం వద్ద జల హారతి నిర్వహించి అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.ఆలయ పూజారులు వారి చేత పూజలు చేయించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన మంత్రి గొట్టిపాటి పలువురు శాసనసభ్యులకు ఆలయ ఈవో మల్లవరపు నాగయ్య స్థానిక నాయకులు సంబంధిత అధికారులు ఘన స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు నిర్వహణ ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ చేసిన ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని మంత్రి గొట్టిపాటి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జబర్దస్త్ టీం ద్వారా ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక, కల్చరల్ కార్యక్రమాలను ఆయన వీక్షించారు. రంగస్వామి బ్రహ్మోత్సవాల్లో కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జ్ ఎరిక్షన్ బాబు తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## అనారోగ్య ఉపాధ్యాయులకు మూల్యాంకన మినహాయింపు కోరిన ఎస్టీయూ



**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
పదో తరగతి పరీక్షల మూల్యాంకన విధుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులను మినహాయించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) మార్కాపురం జిల్లా శాఖ డీఈవోను కోరింది. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుకకు వినతిపత్రం సమర్పించారు. వేసవి తీవ్రత దృష్ట్యా మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అలాగే గుండె, కిడ్నీ, న్యూరో వ్యాధులు ఉన్నవారు, చిన్నపిల్లల తల్లులను విధుల నుంచి మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అక్కల నారాయణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై నిష్పక్షపాత వైఖరి అవసరం : కేఎం అబ్దుల్ సుభాన్




**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కే ఎం అబ్దుల్ సుభాన్, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎం అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. ఓటర్లు బిఎల్ఓలకు సహకరించి తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. ఫారం7 ద్వారా ఓట్ల తొలగింపులో జాగ్రత్తలు అవసరమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీజే మరియు వెల్ఫేర్ పార్టీ నాయకులు, సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ ఏర్పాటుతో పర్యావరణ పరిరక్షణ

### - రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్



**గిద్దలూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**
ఇంటి పైన సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటుతో పర్యావరణాన్ని కాపాడవచ్చని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గిద్దలూరు మండలం కృష్ణశెట్టిపల్లి గ్రామంలో శుక్రవారం పీఎం సూర్య పథకం కింద 130గృహాలకు ఏర్పాటుచేసిన సోలార్ విద్యుత్ కనెక్షన్లను ఆయన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి, ఎర్రగొండపాలెం తెదేపా ఇంచార్జి ఎరిక్షన్ బాబు, కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పథకం కింద ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద అన్ని వర్గాల వారికి 6లక్షల సోలార్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు వివరించారు. రాబోయే 5 నెలల్లో ఈ కలెక్షన్ల ఏర్పాటు పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా వ్యవసాయానికి 9గంటల నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కుసుమ్ పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకానికి సంబంధించి టెండర్లు పూర్తయ్యాయని త్వరలోనే అందుబాటులోకి తెచ్చి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని అన్నారు. విద్యుత్ బిల్లులు పెంచకుండా, లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయం లేకుండా చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ ఇటువంటి పథకాలను నిరుపేదలు అందుపుచ్చుకొని లబ్ధి పొందాలన్నారు. ఇటువంటి సోలార్ కనెక్షన్లు ఇంటి పైన ఏర్పాటు చేసుకోవడం వల్ల నిరంతరం విద్యుత్తు అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రామంలో సోలార్ కనెక్షన్ ఏర్పాటు చేసుకున్న వారందరికీ కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దోర్నాల నేషనల్ హైవే టోల్ ప్లాజాకు హసనాబాద్ పేరు పెట్టాల్సిందేనంటూ ఉద్రిక్తత




**పెద్దదోర్నాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
దోర్నాల సమీపంలోని నేషనల్ హైవే టోల్ ప్లాజా కు హసనాబాద్ పేరు పెట్టాలంటూ హసనాబాద్ గ్రామస్తులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఇప్పటికే అధికార యంత్రాంగం జమ్మిదోర్నాల పేరుతో బోర్డు ఏర్పాటు చేయడానికి యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న ఎస్సై ఎస్.వెంకట రమణయ్య పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రతియ్నించగా వాగ్వివాదం చోటు చేసుకుంది. నేషనల్ హైవే అథారిటీ నిబంధనల మేరకు జమ్మి దోర్నాల టోల్ ప్లాజా పేరుతో గెజిట్ నోటీఫికేసన్ వచ్చింది. ఆ మేరకు ఏర్పాట్లు జరుగుతుండగా టోల్ ప్లాజా ఏర్పాటుకు తమ విలువైన భూములను ఇచ్చామని, టోల్ ప్లాజా పరిధి కూడా హసనాబాద్ గ్రామ పరిధిలోని ఉందని, కనుక హసనాబాద్ పేరును టోల్ ప్లాజాకు పెట్టాల్సిందేనని హసనాబాద్ గ్రామస్తులు ఆందోళన ఉధృతమైంది. ఈ మేరకు హసనాబాద్ గ్రామస్తులు హైకోర్టులో కూడా స్టే ఫిటిషన్ వేశాని, కనుక న్యాయంగా మాకు అవకాశం ఇవ్వాలని పోలీసులకు విన్నవించుకున్నారు. సోమవారం వరకు గడువిస్తున్నామని, ఆ తదుపరి నిబంధనలు మేరకు పనులు జరగాల్సిందేనని పోలీసులు తెలపటంతో గ్రామస్తులు వెను తిరిగి వెళ్లారు.

## హజరత్ కరిముల్లాషా వలి గారి 50 వ ఉరుసు




**మార్టూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మార్టూరులో హజరత్ కరిముల్లాషా వలి గారి 50వ ఉరుసు కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది.మార్టూరులోని పీర్లచావిడి నుండి గొప్పలైటింగ్ ఫోకసింగ్‌లతో గంధము బయలు దేరింది.ఈ ఊరేగింపుకు దర్శి షేక్ ఖాదర్ సాహెబ్ గుర్రం ఈ రేగింపుతో బయలుదేరారు. అరఫ్ నాసిక్ పల్నాడు జిల్లా గొప్ప లైటింగ్ ఫోకసింగ్‌లతో ఈ ఊరేగింపు బయలుదేరింది.

## ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు

### - అక్కడికక్కడే ఒకరు మృతి - నలుగురికి గాయాలు





**పెద్దదోర్నాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం జమ్మిదోర్నాల సమీప కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాలైన సంఘటన జరిగింది. టైర్ పంచర్ కావడంతో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఐసర్ వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. దీంతో ఐసర్ వాహనం వెనుక ఉన్న కర్ణాటక చెందిన వీరేష్ అక్కడికక్కడే మృతి చెందారు.నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తలరించారు. వరి కోత మిషన్తో వెళ్తు టైర్ పంచరై వేసుకుంటూ ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని గుజరాత్ రాష్ట్రం రాజ్కోట్ నుండి శ్రీశైలంకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జమ్మిదోర్నాల - దోర్నాల మార్గమధ్యంలో జరిగింది. బస్సులో 40 మంది వరకు ఉన్నారు. ఒకరికి కాలు విరిగింది. ఐసర్ వాహనం వెనుక వైపు దెబ్బతినగా ప్రైవేటు ట్రావెల్ బస్సు ముందు భాగం నుజ్జయింది. సమాచారం అందుకున్న యర్రగొండపాలెం సీఐ కే.అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీరంగనాయస్వామి వారి కళ్యాణం

### - కళ్యాణోత్సవంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు





**రాచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**
మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో శ్రీ నెమలి గుండ్ల రంగనాయకుని కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉభయ దేవేరులతో కళ్యాణ శోభితుడైన స్వామివారిని అలంకార విడిది నుంచి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించి కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు వెంటరాగా మంగళ వాయిద్యాల నడుమ అర్చక స్వాములు వేద పండితులు కళ్యాణ వేదికకు ఊరేగింపుగా తరలించారు. ఎమ్మెల్యే దంపతులతోపాటు ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయ కుమార్‌లతో పాటు మరో 43 మంది జంటలు కళ్యాణపీఠలపై ఉభయ దాతలుగా వ్యవహరించగా అర్చకస్వాములు కళ్యాణ క్రతువును చూడ చక్కగా నిర్వహించారు. పుష్పాలంకరణ కనువిందు చేయగా ముచ్చటైన ఉభయ దేవేరులు శ్రీదేవి భూదేవిలతో స్వామివారు కళ్యాణ శోభతో కళకళలాడారు. వినసొంపు అయిన వేదమంత్రాలు ఆహ్లాదకర కల్యాణ వ్యాఖ్యానం అశేష భక్తులను అలరించాయి. కంకణ ధారణ ప్రక్రియ నుంచి మాంగళ్యధారణ, తలంబ్రాల వరకు కళ్యాణ ఉత్సవం ఘనంగా కన్నుల పండుగలా సాగింది. కళ్యాణ వ్యాఖ్యాతగా సుధన్వాచార్యులు వ్యవహరించగా అర్చకులు అన్నవరం పాండురంగచార్యులు, సత్యనారాయణ చార్యులు, వెంకట రంగాచార్యులు, లక్ష్మీ మాధవాచార్యులు, మోహనాచార్యులు, భూమరాజు సాయి వంశీ, కూనపులి రమణయ్యులు కళ్యాణ క్రతువు జరిపించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మార్కాపురం డిఎస్పి యు నాగరాజు వారి సిబ్బందితో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

## నేడే గంగ దొనకొండ తిరునాళ్ల



**కురిచేడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మండలంలోని గంగదొనకొండలో వేంచేసియున్న గంగమ్మ తల్లి తిరునాళ్ల శనివారం నాడు జగనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తిరునాళ్లకు పలు జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున ఏర్పాట్లన్నీ అందుకు తగ్గట్టుగా పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ తెలిపారు.

## శిలువ మరణం ద్వారా రక్షణ



**కురిచేడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
ఏసుక్రీస్తు శిలువ మరణం ద్వారా మానవాళికి రక్షణ లభించిందని కురిచేడు మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, పొట్లపాడు సియోను ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు రెవ షేక్ కాశీం తెలిపారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని అన్ని చర్చిలలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు ఈ ప్రార్థనలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ మానవాళికి ప్రేమ శాంతి కరుణ దయ గుణాలతో పాటు ఒకరి యెడల ఒకరు ప్రేమ కలిగి ఉండాలనే సత్యాన్ని బోధించారని, ఎన్నో అద్భుతమైన క్రియలు చేసి మన కొరకు కల్వరి సిలువలో ప్రాణం పెట్టి రక్షణ అనుగ్రహించినట్లు వివరించారు. ఏసుక్రీస్తు శిలువలో మరణిస్తు పలికిన ఏడు మాటలు క్రైస్తవులు కలిగి ఉండాలన్నారు. గత 41 ఒక్క రోజులుగా ఉపవాస దీక్షలు చేపట్టిన క్రైస్తవులు తమ ఉపవాసాన్ని నేడు ముగించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




**కురిచేడు, ఏప్రిల్ 3,ప్రభాతవార్త**
కురిచేడు మండలం పెద్దవరం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పైదవరం గ్రామంలో వివాహానికి హాజరై నలుగురు వ్యక్తులు, తిరిగి ప్రయాణంలో కురిచేడు వైపు వస్తుండగా కారుకు అడవి పంది అడ్డుగా రావడంతో దానిని తప్పించబోయి అదుపు తప్పి కారు వాగులో బోల్తా కొట్టింది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు ప్రమాదాన్ని గమనించి, కారులో నుంచి నలుగురిని బయటకు తీసి చూడగా, హైదరాబాద్‌కు చెందిన ఎంఎల్ నాగేశ్వరరావు తీవ్ర గాయాలతో కొన ఊపిరితో ఉన్నట్లు గమనించి, 108 వాహనానికి కాల్ చేయగా 108 సిబ్బంది నాగేశ్వరరావును గాయాలైన వారిని దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నాగేశ్వరరావు మరణించినట్లు సమాచారం.

## భక్తిశ్రద్ధలతో శుభశుక్రవారం




**కొనకనమిట్ల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు శుభ శుక్రవారం పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొనకనమిట్ల షారోన్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ కోలా రవికుమార్ ప్రార్థనలు నిర్వహించి సిలువపైఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలు వివరించారు. క్రీస్తు మందిరం,ఈసీఐ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎదురాళ్లపాడు,సిద్ధవరం,పెద్దారికట్ల, గొట్లగట్టు గ్రామాలలోని చర్చిలతో పాటుపలు గ్రామాలలో శుభ శుక్రవారంను ఘనంగా జరుపుకున్నారు.

## మాజీ ఎంపీపీ పెద్ద పిచ్చయ్య తల్లి దేవమ్మ మృతి

### - నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే ఉడుముల



**కొనకనమిట్ల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మాజీ ఎంపీపీ దివంగత చిరుగురి పెద్ద పిచ్చయ్య తల్లి దేవమ్మ(106) వయో భారంతో పాటు అనారోగ్యానికి గురై మృతి చెందింది. చిన్నారికట్లలోని దేవమ్మ పార్థివ దేహానికి కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరితో పాటు కొనకనమిట్ల ఎంపీపీ మురళీకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు రెడ్డం వెంకటరెడ్డి, మండల వాలంటీర్స్ విభాగం అధ్యక్షులు మరావతి వెంకటేశ్వర్లు, గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు పిచ్చరావు, దేవసహాయం, కార్యకర్తలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## విద్యుత్ ఘాతానికి గురై పెయింటర్ మృతి

**పొదిలి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
పొదిలి పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వీధిలో ఒక నూతన ఇంటికి పెయింట్ వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో పెయింటర్ బుసిరాజు నాగరాజు(45) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక తాలూకా ఆఫీసు వీధికి చెందిన మృతుడు నాగాజుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలిగి ఉన్నారు. కుటుంబాన్ని పోషించే భర్త నాగరాజు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో భార్య, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ వాహనం సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ షాక్ గురైన నాగరాజును పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. ఎస్సై రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




IN THE COURT OF HON'BLE IIIrd Addl. DISTRICT & SESSIONS JUDGE, R.R. DISTRICT:: AT. L.B.NAGAR
I.A. No. 702 of 2025
In
O.S. No. 1143 of 2018

Between:
**T. Mallesh Yadav** ...Plaintiff
And
**K. Sri Ram Reddy & others** ...Defendants

To,
**Res No-57-** Markapuram Subba Reddy S/O M. Venkata Reddy, R/o. H.No. 1-23, Yadavalli, Racherla Mandal, Prakasham – 523356, A.P.

**NOTICE**

Take notice that the above plaintiff filed the above I.A against you for impleadment in above case in respect of the suit property i.e., in Sy No: 494 situated at Nadergul Village, Balapur (M), R.R District, for Declaration of Title perpetual Injunction and the above case is posted to **29/4/2026** for your appearance. Make it convenient to appear on **29/4/2026 at 10.30 AM** before the above court either in person or through advocate, otherwise the matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT//

**(A. Ramesh Yadav)**
**A. Shobha Rani**
**Advocates**
#14-158, Shamshabad Vill. R.R.Dist., **Cell: 9440097099**
**Counsel for Plaintiff**

# పదవి ముగిసినా సేవ కొనసాగుతుంది

## - బట్టుపల్లి సర్పంచ్ రవీంద్ర భావోద్వేగ వీడ్కోలు



**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం బట్టుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ డబ్బుగొట్టు రవీంద్ర తన ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 2021 ఏప్రిల్ 2న సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన,ప్రజల విశ్వాసం, సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని తెలిపారు. గ్రామ ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు జీవితాంతం మరువలేనివని, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు కృషి చేశానని ఆయన పేరొకన్నారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని, కానీ ప్రజల గుండెల్లో సంపాదించిన స్థానం మాత్రం చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. తన ఐదేళ్ల ప్రయాణాన్ని తృప్తిగా ముగిస్తున్నానని, ఇకపై కూడా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈ కాలంలో సహకరించిన గ్రామ ప్రజలు, నాయకులు, ఉద్యోగులందరికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన వల్ల ఎవరైనా అసౌకర్యానికి గురై ఉంటే క్షమించాలని వినమ్రంగా కోరిన రవీంద్ర, ప్రజా సేవే తన లక్ష్యమని మరోసారి నొక్కి చెప్పారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం భాస్కర్

## - జ్ఞాపకార్థంగా ఉచిత మజ్జిగ పంపిణీ




**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలో మానవత్వానికి ప్రతీకగా నిలిచిన భాస్కర్ మెడికల్స్ అధినేత కి.శే నీలిశెట్టి భాస్కర్ జ్ఞాపకార్థంగా కనిగిరి మానవతా శాఖ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పామూరు బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అర్ధరాత్రి వేళలో కూడా అవసరమైన వారికి మందులు అందిస్తూ, చిన్న సహాయం కోసం వచ్చిన వారిని ఎప్పుడూ నిరాశపరచని నీలిశెట్టి భాస్కర్ సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన మానవత్వం, సేవాభావం అందరికి ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి మొదటి దాతగా కనిగిరి మానవతా శాఖ చైర్మన్ వాగిచర్ల వెంకటేశ్వర్లు వ్యవహరించారు. కమిటీ సభ్యులు, ట్రాఫిక్ ఏఎస్సై, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేసవి వేడిలో ప్రజలకు ఉపశమనం కలిగించేలా నిర్వహించిన ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ప్రజలు నుంచి స్పందన తెలియజేస్తూ సంతోషంగా మజ్జిగను సేవించారు.

### గిన్నిస్ రికార్డు సాధనలో డాక్టర్ రవి ఇండ్లా భాగస్వామ్యం కనిగిరికి గర్వకారణం



**కనిగిరి, ఏప్రిల్ 3,ప్రభాతవార్త**
అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక మైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధనలో డాక్టర్ రవి ఇండ్లా భాగస్వామ్యం కావడం గర్వకారణంగా నిలిచింది. ఆరోగ్య రంగంలో కృత్రిమ మేథస్సు(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) పై నిర్వహించిన ప్రత్యక్ష యూట్యూబ్ పాఠానికి అత్యధికంగా 17,999 మంది వీక్షకులు పాల్గొనడం ద్వారా ఈ గిన్నిస్ రికార్డు నమోదైంది. ఈ రికార్డు 2026 ఫిబ్రవరి 25న ఢిల్లీలో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ డాక్టర్ అభిజాత్ శేత్ ఆధ్వర్యంలో సాధించబడింది. ఈ విశిష్ట కార్యక్రమంలో డాక్టర్ రవి ఇండ్లా పాల్గొని తన వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆయనకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుండి ప్రశంసా పత్రం అందించడం జరిగింది. డాక్టర్ రవి ఇండ్లా సాధించిన ఈ విజయంతో ప్రాంతీయంగా గర్వకారణంగా మారింది. వైద్య రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగానికి అభిప్రాయపడ్డారు.

# త్యాగం, ప్రేమకు ప్రతీక గుడ్‌ఫ్రైడే

## - అబ్దుల్ గఫార్



**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
కనిగిరిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా కాశిరెడ్డి కాలనీలోని హోసన్న కల్వరి కృప ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ యేసుక్రీస్తు చేసిన త్యాగం మానవాళికి ప్రేమ, క్షమాగుణానికి ప్రతీక అని అన్నారు. సమాజంలో ప్రేమ, సహనం పెంపొందాలని ఆకాంక్షించారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కుటుంబాలు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి ప్రసాద్, షేక్ సుహైల్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీల హక్కుల కోసం పోరాటానికి రెడీ

## - ఏప్రిల్ 11న బోడె రామచంద్ర యాదవ్ ఆమరణ దీక్ష



**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మార్కాపురం జిల్లా బీసీవై పార్టీ కన్వీనర్ నరేంద్ర కీలక ప్రకటన చేశారు. బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ నాయకత్వంలో బీసీల హక్కుల సాధన కోసం పోరాటానికి సిద్ధమయ్యామని తెలిపారు. బీసీరక్షణ చట్టం అమలు, అమరావతి రాజధాని ప్రాంతంలో 1000 ఎకరాల భూమి కేటాయింపు, బీసీ కార్పొరేషన్లకు నిధులు, సమగ్ర కుల గణన, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్టసభల్లో 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈడిమాండ్లను మార్చి 31 లోగా అమలు చేయాలని కోరినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఏప్రిల్ 11వ తేదీ నుంచి బోడె రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష చేపడతారని నరేంద్ర ప్రకటించారు. ఈ హామీలు తెలుగుదేశం పార్టీ నేత నారా లోకేష్ పాదయాత్రలో ప్రకటించినవేనని, వాటినే అమలు చేయాలని కోరుతున్నామని తెలిపారు. ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధి చూపకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దాసరి మల్లిఖార్జునరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, రామకృష్ణ, శివయ్య, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతపై శక్తి టీం అవగాహన



**చీరాల టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
పట్టణంలోని వాహనదారులు రహదారి నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని చీరాల సబ్ డివిజన్ శక్తి టీం సభ్యులు పిలుపు నిచ్చారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డీఎస్పీ మొయిన్ సూచనలతో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో భారీ రహదారి భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి టీం ఎస్సై హరిబాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడాన్ని భారంగా భావించకూడదని, అది ప్రాణాలను కాపాడే ముఖ్యమైన రక్షణ చర్య అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. కానిస్టేబుల్ సుబ్బారావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు హదారి నియమ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో వాహనాలు నడపడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా చీరాల టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్మమంలో శక్తి టీం సభ్యులు, పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## నేడే పోకూరుకు ఎమ్మెల్యే ఇంటూరి రాక

## - రైతుపట్టాదారుపాస్‌పుస్తకాలు పంపిణీ



**కందుకూరు ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
వలేటివారిపాలెం మండలంలోని పోకూరు గ్రామంలో శనివారం రైతు పట్టాదార్ పాస్‌పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరుకానున్నారని డిప్యూటీ తహసిల్దార్ మధుసూదనరావు తెలిపారు. ఆయన చేతులమీదుగా రైతులుకు పాస్ పుస్తకాలు అందచేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి రైతులుంతా హాజరై సంబంధిత పాస్‌పుస్తకాలను అందుకోవాలని ఆయన సూచించారు.

## రోమన్ క్యాథలిక్ మిషన్ ఆధ్వర్యంలో పరిశుద్ధ సిలువ మార్గ ధ్యానములు



**వేటపాలెం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
సర్వమానవాళి పాప పరిహారమునకై సిలువను మోసి, తన రక్తం చిందించి, సిలువపై మరణమొంది తిరిగి మూడవ రోజు లేచిన క్రీస్తు బోధించిన మార్గమే సర్వ మానవాళికి మోక్ష మార్గమని ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు టి.కరుణాకర్ పేర్కొన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆనాడు ఏసు శిలువను మోస్తూ పొందిన శ్రమలను కళ్ళకు కట్టినట్లుగా పురవీధులలో ప్రదర్శించారు. ప్రపంచంలోని క్రైస్తవులు 40 రోజులు పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో, ఉపవాసాలతో, పవిత్రంగా ఆచరించే ఈ సిలువ మార్గం వేటపాలెం పువీధులలో ప్రత్యేక ఆకర్షణంగా నిలిచిందని చీరాల మాజీ ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రెగోరి అన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోహోదరి సోదరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన వారందరికి సహాపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా వేటపాలెంలోని జేసునగర్, పొట్టి సుబ్బయ్యపాలెం, అక్కాయపాలెం, సిలోన్ కాలనీ, సెయింట్ ఆంథోని లెప్రసీ కాలనీ, రామచంద్రాపురం, సర్వోదయ కాలనీ క్రైస్తవ మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# అడ్డగోలు నిర్మాణాలలో చల్లారెడ్డిపాలెం రోడ్లు



**వేటపాలెం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెం పంచాయతీ పరిధిలోని సచివాలయం ఎదురుగా ఉన్న టీ కొట్టులో శాశ్వతంగా ఉండే విధంగా షెడ్డు నిర్మాణం చేపట్టి, బోరు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. అర్ధరాత్రి సమయంలో మాత్రమే పనులునిర్వహిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఆర్అండ్‌బి రోడ్డుకు సంబంధించిన ఈ నిర్మాణానికి అవసరమైన విద్యుత్ మీటర్‌ను పంచాయతీ మంజూరు చేయడంపై పలు ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంపై కూడా స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ వ్యవహారానికి కొంత మంది రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## రోడ్డు భద్రతపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలి



**చీరాల టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
రోడ్డు భద్రతపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని కారంచేడు ఎస్సై ఎస్‌కే ఖాదర్ భాషా అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌హెచ్ 167(ఏ)పై వాహనదారులను ఆపి రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని, హెల్మెట్ ధరించి ప్రతి ఒక్కరూ ప్రయాణాలు చేయాలని మద్యం తాగి వాహనాలు నడపరాదని అలా నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సోన పోరంబోకు ఆక్రమణ



**వేటపాలెం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
దేశాయిపేట పంచాయతీ పరిధిలోని నీలకంఠపురంలోని సర్వే నెంబర్ 392లోని సోనపోరంబోకు ను శుక్రవారం ఉదయం కొందరు స్థాఇనకులు సోన పూడ్చి, ఆక్రమించే ప్రయత్నం చేశారు. సదరు విషయం తెలుసుకున్న చల్లారెడ్డిపాలెం వీఆర్వో రఫీ సంఘటన స్థలానికి చేరుకుని ఇది సోన అని, దీనిని ఆక్రమణ చేయరాదని చెప్పి, స్థానికులు సోనలో వేసిన మార్కింగ్ ను తీసివేయించారు. అంతటితో సద్దుమణిగింది అనుకున్న ఆక్రమణ పర్వం సాయంత్రానికి చరమాంకానికి చేరింది. సాయంత్రానికి సోన పోరంబోకు చేరుకున్న స్థానికులు కర్రలతో పాకాల నిర్మాణం చేపట్టారు. ఈ సమాచారాన్ని గ్రామస్తులు అధికారులకు చేరవేసినప్పటికి వారి నుండి ఎటువంటి స్పందన లేదని స్థానికులు చెబుతున్నారు.

# క్రైస్తవ సోదరుల ప్రత్యేక ప్రార్థనలు




**కొరిసపాడు, ఎప్రియల్ 3, ప్రభాతవార్త**
క్రైస్తవుల సోదరులకు పరమ పవిత్రమైన గుడ్ ఫ్రైడే పండుగ సందర్భంగామేదరమెట్ల గ్రామంలోని రహెబోతు ప్రార్థనా మందిరంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.ఈ ప్రార్థనలలో పాల్గొన్న దైవ సేవకులు పాస్టర్ ఆశీర్వాదం,పేరం సతీష్ గుడ్ ఫ్రైడే ఆవశ్యకతను,విశిష్టతను ప్రార్థనలకై వచ్చిన జనులకు సవివరంగా వివరించారు. ప్రభువైన ఏసుక్రీస్తు మనుషుల పాప పరిహారం కోసం కల్వరి సిలువలో మృతి చెందాడని వారు తెలియజేశారు. ప్రభువు చిందించిన రక్తం మనలను పాపాల నుంచి విముక్తి కలిగిస్తుందని తెలిపారు. బాప్తిసం తీసుకున్న ప్రతి ఒక్కరికి పరలోక రాజ్యంలో తప్పక చోటు ఉంటుందని,జనులందరూ ప్రభువును నమ్ముకుని పాప విముక్తులు కావలసిందిగా వారు తెలుపుతూ ప్రార్థనలు చేశారు.

# నేడు చింతలపూడి పర్యటన వివరాలు



**అద్దంకి ,ఎప్రియల్ 2,ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ శనివారం ఉదయం 10 గంటలకు సింగరకొండలో తిరుమల పవిత్ర తను కాపాడే దిశగా బి.ఆర్ నాయుడుని వెంటనేచైర్మన్ పదవినుండి తొలగించాలని డిమాండ్‌చేస్తూ శ్రీప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు,11 గంటలకు స్దానిక వైసిపి కార్యాలయంలో ఐదు మండలాల సర్పంచ్‌ల పదవీ విరమణ సన్మాన సభలో పాల్గొంటారని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల





**చీరాల టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
చీరాల పట్టణం పాపరాజుతోటలో స్వయం భూగా వెలసివున్న శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ పోతురాజు స్వామి మరియు అంకమ్మ తల్లి వార్ల అమ్మవారి తిరునాళ్ల ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆలయ ప్రాంగణం ప్రత్యేకంగా అలంకరించబడగా, విద్యుత్ దీపాలతో వేపాకు తోరణాలతో సుందరంగా ముస్తాబైంది. ఏప్రిల్ 3వ తేదీన వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కలశ స్థాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఏప్రిల్ 4 వ తేదీన పాలబిందెలతో ఊరేగింపు ముఖ్య ఆకర్షణగా నిలవనుంది. గ్రామీణ ప్రాంతాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పాల్గొననున్నారు. అనంతరం అమ్మవారికి ఘనంగా పాలాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ లలితా సహస్రనామ పారాయణము, సాయంత్రం 7 గంటలకు త్రిధారా ది ఆర్ట్ లాండ్, చీరాల వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించబడనుండగా, భక్తులను అలరించనుంది. ఏప్రిల్ 5వ తేదీన ఆదివారం ఉదయం అమ్మవారి పాపనం ఊరేగింపు వైభవంగా జరగనుంది. అదే రోజు సాయంత్రం బాజి అండ్ దొరబాబు బృందం వార్లచే భక్తి పాటల కచ్చేరి జరుగుతుంది. ఈ మహోత్సవాల్లో భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# అంగరంగ వైభవంగా చెన్నకేశవ స్వామి కళ్యాణం

## - గోవింద నామస్మరణలతో మార్మోగిన మార్కాపురం

## - వేలాది భక్తుల సమక్షంలో వేదఘోషల మధ్య దివ్య కళ్యాణ మహోత్సవం

## - కలెక్టర్ ఎం విజయ సునీతతో పాటు పాల్గొన్న ప్రజాప్రతినిధులు











**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన స్వామివారి దివ్యకళ్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించగా, పుష్పాలంకరణల తో కళ్యాణ మండపం మరింత శోభాయమానంగా కనిపించింది. జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆలయానికి విచ్చేసి స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆమెకు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణ మండపానికి చేరుకున్న కలెక్టర్, వేద మంత్రోచ్చారణల మధ్య జరుగుతున్న కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు.ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ప్రధానఅర్చకులు అప్పనాచార్యులు,వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సంప్రదాయ బద్ధంగా జరిగిన ఈ దివ్య కళ్యాణ మహోత్సవం భక్తులను ఆధ్యాత్మిక లోకంలో ముంచెత్తింది. జై చెన్నకేశవ స్వామి గోవిందా గోవిందా నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. తలంబ్రాలు, మంగళసూత్రధారణ వంటి సంప్రదాయ కర్మలు విశేష ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి,ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు కేపీ కొండారెడ్డి, అన్నా రాంబాబు, టిడీపి నాయకులు కందుల రామిరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వారు స్వామివారి ఆశీస్సులు పొందుతూ ప్రాంత ప్రజల శ్రేయస్సు కోరుకున్నారు. అశేష భక్తులు హాజరై స్వామివారి దివ్య కళ్యాణాన్ని దర్శించుకుని పుణ్యఫలాన్ని పొందారు. మొత్తం వేడుక అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో కొనసాగింది.

### చట్టబద్ధత కల్పించినందుకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ కార్యాలయంలో సంబరాలు



**సంతనూతలపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించినందుకు గాను హర్షిస్తూ సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. లోకసభ,రాజ్యసభలలో అమరావతి రాజధానికి ఘనంగా ఆమోదం తెలపడంపై ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తద్వాఅ అమావతి రాజధానికి రాజముద్ర లభించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే విజయ్ కుమార్ స్వయంగా సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు అలియాస్ పీఎస్ఆర్ బాణసంచా దద్దరించారు. జై అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించినందుకు ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షాలకు ఇందుకు విశిష్ట కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు,తెళ్ళ మనోజ్ కుమార్, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, మల్లవరం దేవస్థానం చైర్మన్ ఎం.రాఘవ, టీడీపీ నాయకులు పీఎస్ఆర్‌డీ అనిల్ కుమార్, ఎన్.సుబ్బారెడ్డి, వలేటి ప్రభుత్వస్వామి, పాతూరి రంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిమ గల గరుడ ఆళ్వార్ చదలవాడ శ్రీ రఘునాయక స్వామి

## కళ్యాణం కమనీయం







**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
చదలవాడ రఘునాయక స్వామి కళ్యాణం భక్తజన గోవిందా నామస్మరణ వేద పండితుల వేద మంత్రాల మధ్య రంగ రంగ వైభవంగా కళ్యాణం వైభవంగా జరిగింది. కళ్యాణం తిలకించేందుకు భారీగా భక్తులు హాజరయ్యారు. గరుడ పక్షి ఆలయ ప్రదక్షిణ అనంతరం కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణి క్యాక్రమానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ తట్టుకోలేక భక్తులు అస్వస్థకు గురికాగా వారిని అక్కడ ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సేవలు అందించారు.

**రథోత్సవానికి మోత కాపులు మొరాయింపు :**
రఘునాయక స్వామి కళ్యాణ అనంతరం రథోత్సవ క్యాక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా మూతకాపులు వారి డిమాండ్లతో రథోత్సవ నిరాకరించాఉ. దీంతో రథోత్సవ క్యాక్రమం రద్దయింది లేదని రకకాల పుకార్లతో భక్తులు నిరాశకు లోనవుతున్న సందర్భంలో ఒంగోలు డీఎస్పీ పరిస్థితిని అర్ధం చేసుకుని అందుకు గల కారణాలను ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఈవో రెడ్డితో సంప్రదించి చర్యలు చేపట్టారు. దాతలు తూమాటి రాంబోట్లు చౌదరి ట్రస్టీ ఫౌండర్ ఉప్పల లక్ష్మీ నసింహ చార్యులు మూతకప్పులతో డీఎస్పీ ఆయపాటి శ్రీనివాసరావు సమావేశం ఏర్పాటు చేశారు. మోతకాపులు ఫస్ట్ ఫౌండర్‌ను ఉభయ దాతలు పూజకో ఆహ్వానించారు. కానీ మూతకాపులు అందుకు నిరాకరించి తమకు మళ్ళీ అవమానం జరగకుండా ఎండోమెంట్ అధికారులు లిఖితపూర్వకంగా రాసి వాళ్ళని డిమాండ్ చేశారు. ఈ ఘటన భక్తుల్లో మరింత ఆవేశాన్ని నిరాశను రగిలించింది. భక్తుల ఆందోళన మధ్య అసిస్టెంట్ కమీషనర్ పానకాలరావు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దె క్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాస్‌తో సంప్రదించి ఇటిక్యాలకు రథోత్సవాన్ని సాగించారు.

**భారీ బందోబస్తు :**
కళ్యాణ మహోత్సవం రథోత్సవానికి ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు రూరల్ సీఐ తో పాటు ఆరుగురు ఎస్సైలు 100 మంది పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను సాగించారు.

**ఎట్టకేలకు రథం కదిలింది :**
చదలవాడ తిరునాళ్లలో శ్రీ రఘునాయక స్వామివాఇ రథం ఇంత ఆలస్యంగా కదలడం బహుశ ఇదే తొలిసారి. అసిస్టెంట్ కమీషన్‌తో మాట్లాడుతున్న సత్యమాధవి దేవాలయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమీషన్ పానకాలరావు తోమాటి సత్యమాధవి పరిస్థితిని వివరించారు. ఆయన మాట్లాడుతూ సమయం ఇప్పుడు కాదని కార్యాలయానికి వస్తే వివరంగా లిఖితపూర్వకంగా అందిస్తే విచారించి చర్యలు చేపడతామని తెలిపారు.

గరుడ ఆళ్వార్ చదలవాడ శ్రీ రఘునాయక స్వామి వారికి ప్రత్యేక చరిత్ర ఉంది.చదలవాడలో ఏటా జరిగే కళ్యాణ ఉత్సవానికి ఎటువంటి ముహూర్తం ఉండదు. గత 241 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం ఆగకుండా గరుడ ఆళ్వార్ వారు వచ్చిన





సమయమే ముహూర్తంగా భావించి కళ్యాణ ఉత్సవం మొదలు పెడతారు. గరుత్మంతుల వారు కళ్యాణ సమయంలో విచ్చేసి స్వామివారికి మూడు ప్రదక్షిణలు చేసి ఎవరికి కనపడకుండా మాయం అయిపోతారు. ఇక్కడ ఇది గత రెండు వందల నలభై ఒక్క సంవత్సరం నుంచి ప్రతి ఏడాది జరుగుతూనే ఉంటుంది.ఇది ఇక్కడ ప్రత్యేక ఆకర్షణీయంగా ఉంటుంది. వేలాదిగా జనాలు విచ్చేసి స్వామివారి కళ్యాణం చూసి గరుత్మంతుని వారిని దర్శనం చేసుకుంటారు.

